# హేమంత తుషారం – 8

రెండు రోజుల తర్వాత....

కాలేజి నుండి ఇంటికి వచ్చాక మహాలక్ష్మి తన పేర వచ్చిన ఉత్తరాన్ని టీపాయ్ మీద నుండి తీసుకుని చదవటం మొదలు పెట్టింది.

ఏమిటండీ మహాలక్ష్మిగారూ

ఎందుకిలా చేస్తున్నారు...? నన్ను చూడగానే మీ పెదవులపై చిందులేస్తున్న చిరునవ్వు కాస్తా చటుక్కున మాయమైపోయి... ఏదో నిర్లిప్తత వచ్చి ఆక్రమిస్తోంది...! కారణం ఏమిటో తెలియక తికమక పడిపోతున్నా! మీ చూపుల్లోని చిరుకోపాన్ని అయినా ఫరవాలేదు తట్టుకోగలనుగానీ, ఇలాంటి ఉదాసీనతను మాత్రం సహించలేక... విషయం ఏమిటో కాస్త విప్పి చెప్పమని ప్రాధేయపడటానికే ఈ ఉత్తరం!

ముందుగా చూసినపుడు... మీ కన్నుల్లో రేఖా మాత్రంగా కనుపించిన ఇష్టాన్ని గమనించాకనే, నాలో చిన్న ఆశ చిగురేసింది! ఆ తర్వాత కొంచెం చొరవ తీసుకుని.... నిర్భయంగా నా మనసును మీ ముందుంచాను!

మా ఇంటికి నా ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు.... సంబరంతో ఆకాశ హర్మ్యాల్ని కట్టేసుకున్నాను! మీరు హాయిగా నవ్వుతూ, సరదాగా మాటలు కలపటంతో.... కలల ప్రపంచంలోకి రాకెట్‌లా దూసుకుపోవటానికి రెడీ అయిపోయా!

కానీ... అదేమిటో, అంతలోనే మీ మూడ్ మారిపోయింది! గమ్యం చేరుకోని రాకెట్‌లా నా మనసూ నేలకి దిగివచ్చింది! కారణం ఏమిటో తెలియజెప్పరూ...?

ఇక నాకైతే... మీ ఆలోచనలు వస్తేనే మనసు వశం తప్పుతోంది... 'పర'...వశం అయిపోతోంది! నిజమండీ...! అప్పటివరకూ మనసులో ఓమూల నిశ్చలంగా పడివున్న మధురోహల మూట ముడి... విడివడి... నా ఆశలన్నీ రాశులుగా రాలి... అక్షరాలుగా మారి ఈ కాగితం నిండా పరుచుకోవాలని

ఉరకలు వేస్తుంటే... సరే కానియ్‌మని వదిలెయ్యాలా... కట్టడి చేయాలా... తెలియక తికమక పడిపోతున్నా! అందుకే మీ అభిమతం ఏమిటో స్పష్టంగా తెలియజేయమని విన్నవించుకుంటున్నా...!

అప్పటి వరకూ చదివిన మహాలక్ష్మిలో ఆవేశం పొంగి వచ్చింది!

తన మనసూ వశం తప్పేట్లుగా ఎందుకతను ఇలాంటి కవ్వింపు రాతలు రాయటం....?

ఇంకొకరితో పెళ్ళికి సిద్ధపడుతూ, తనకు ఇలాంటి ఉత్తరాలు రాయటం తప్పుకాదూ…? కోపంతో చదువుతున్న ఉత్తరాన్ని మధ్యకు చించేసింది.

లోపల గదిలో అటూ ఇటూ తిరుగుతూనే మహాలక్ష్మిని గమనిస్తున్న మీనాక్షమ్మ చటుక్కున ముందుగదిలోకి వచ్చి ''ఏమిటమ్మా, అలా చించేశావ్….? నువ్వు ఏ ఉత్తరాన్నీ ఇలా వెంటనే చింపవుగదా…?'' అనడిగింది ఆశ్చర్యంగా చూసి.

''మాయమాటలు చెప్పేవాళ్ళంటే…. నాకు నచ్చదు… ఒళ్ళుమండుతుంది…!'' అంటూ ఆ కాగితాన్ని టీపాయ్ మీద పడేసింది.

''మన చుట్టూ ఉండే వాళ్ళలో, మనల్ని మెచ్చేవాళ్ళూ, నచ్చేవాళ్ళూ మాత్రమే ఉండరు! రకరకాల మనస్తత్వాల వాళ్ళూ ఉంటారు! ఎవరి మీద అయినా కోపం తెచ్చుకోవటమంటే, అది… మన మనసుకు మనం చేటు చేసుకోవటమే అవుతుంది! అందుకని అలాంటి వాళ్ళకు దూరంగా ఉండటమే ఉత్తమం…!'' అంటూ ఆవిడ లోపలకు వెళ్ళిపోయింది.

మహాలక్ష్మి నిగ్రహించుకుంది.

కోపంతో ఉత్తరం చింపటం వలన ఏమౌతుంది… చదివితే మాత్రం నష్టం ఏముందీ…! అడ్డంగా చిరిగిన మరో సగాన్ని చేతిలోకి తీసుకుని మళ్ళీ చదవటం మొదలు పెట్టింది.

మీకో నిజం కూడా చెప్పెయ్యాలనిపిస్తోంది! నేను ఈ కాలేజిలో చేరటానికి ముఖ్య కారణం… మీరే! అవునండీ! కేవలం మీ దర్శనభాగ్యం కోసమే! దూరం నుండి అయినా ప్రతీరోజూ చూడగలను కదా!

మీరు ఎదురుపడితే… 'జాజిపూల జలపాతమా, పారిజాతాల ప్రవాహమా అనే సందిగ్ధం కలుగుతుంది! ఇక కళ్ళెత్తి చూసేసరికి… పులకింతల విద్యుత్తు ఒళ్ళంతా జరజరా పాకి…' నిశ్చేష్టుడినై నిలబడిపోతాను!

మీ కథల్లోని వాక్యాలను విరివిగా వాడేస్తున్నానని కాపీరైటు చట్టం క్రింద నామీద కేసుగానీ పెట్టరుకదా…!

ఇంకొక విషయం కూడా మీకు చెప్పాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, ఎవరైనా ఆ సంగతులు మీకు చేరవేస్తే… మీరు నన్ను అపార్థం చేసుకునే అవకాశం ఉంది! ముందుగా నేను చెబితే, అర్థం చేసుకోగలరని… అంతే!

మన వాళ్ళ మధ్య ఏదో విషయం మీద సంభాషణ సాగుతున్నపుడు… ఒకరు మీ ప్రస్తావన తీసుకువచ్చారు. మీరు ఎక్కువగా కబుర్లలో పాలు పంచుకోకపోవటానికి అసలు కారణం… విషయ పరిజ్ఞానలోపం బయటపడకుండా ఉండటానికి మాత్రమేనని తేల్చి చెప్పటం జరిగింది! అపుడు నేను కూడా సరదాగా ఓ మాట అన్నాను 'తక్కువ మాట్లాడటమే ఎక్కువ తెలుసుననటానికి నిదర్శనమన్నారు కదా!' అని.

దానికి వాళ్ళంతా, నేనేదో మిమ్మల్ని ఎక్కువగా సపోర్టు చేస్తున్నానంటూ రకరకాలుగా కామెంట్లు చేశారు. అవన్నీ చెప్పటం అప్రస్తుతమేననుకోండి... అయితే, నేనన్నది ఆసందర్భంలో ఆ ఒక్కమాట మాత్రమేననీ, మిగతా సంభాషణలన్నీ వాళ్ళఊహాగానాలేనని మీకు తెలియబరచటానికే ఈ వివరణ! అర్ధమైందనుకుంటా!

మొదటిరోజే మీరు హెచ్చరించినట్లుగా... ఇక్కడి వాళ్ళలో వదంతుల వ్యాప్తిపట్ల వ్యామోహం కొంచెం ఎక్కువే!

సరేనండి, ఇక ముగిస్తాను. నాప్రశ్నకి జవాబు ప్రత్యక్షంగానా లేక ఇలా  పరోక్షంగా ఉత్తరం ద్వారానా అనేది మీ నిర్ణయానికే వదిలేస్తున్నాను..

` హేమంత్

చిరిగిన రెండు కాగితాలనూ పేర్చి జాగ్రత్తగా పట్టుకుని వెనక వైపూ చదవటం పూర్తి చేసిన మహాలక్ష్మి తేలిగ్గా నిట్టూర్చింది.

ఆ కాగితాన్ని చెత్తబుట్టలో పడెయ్యటం ఎందుకనో మనస్కరించక, తన డ్రాయరు సొరుగులో ఒక మూలకి నెట్టేసి వచ్చి కూర్చుంది.

వంట ప్రయత్నంలో ఉంటూనే అటూ ఇటూ తిరుగుతున్న మీనాక్షమ్మ మనవరాలి మొహంలోని మార్పును పసిగట్టి తేలిక పడిరది.

ప్రశాంతంగా, మామూలుగానే కనుపించే సరికి దగ్గరకు వచ్చి కూర్చుని ఆప్యాయంగా పలుకరించింది.

''ఆ రోజు హేమంత్ వాళ్ళింటికి నీకు ఇష్టంలేకపోయినా, నేనే నచ్చ చెప్పి అనవసరంగా పంపించానా అనిపిస్తోంది. అక్కడ నాగసుందరి కనుపించి... నీ ప్రశాంతతను మాయం చేసింది!''

మహాలక్ష్మి ''అదేం లేదు నాన్నమ్మా... ''అంటూ నిట్టూర్చింది...'' నాకు నచ్చని పని అయినా సరే, నీకు ఆనందం కలుగుతుందనుకుంటే, ఇష్టంగానే చేస్తాను...!''

''నా ఆనందం అంతా నీతోనే ముడిపడి ఉంది! నీకు మేలు చేయని, ఇష్టంలేని పనులను పూరమాయించటం నాకు ఆనందం కాదే...!'' ఆవిడ కంఠం బొంగురుపోయింది.

మహాలక్ష్మి నాన్నమ్మ భుజం మీద చేయివేసి ''ఇద్దరం చెప్పిందీ ఒకటేగదూ...'' అంటూ నవ్వింది. ఆవిడా తలవూపుతూ చిరునవ్వుతో చూసింది.

''అదేమిటోనే, ఆలోచిస్తోంటే, చాలా ఆశ్చర్యంగా ఉంది! రెండోసారీ ఆ నాగ సుందరి ఇక్కడ ప్రత్యక్షమై నీ జీవితానికి అడ్డం పడటం ఏమిటో...!'' అంటూ మళ్ళీ నిట్టూర్చిందావిడ.

‘‘నాన్నమ్మా.... అలా అనుకోకూడదు. ముందు నేనూ తన గురించి వేరే విధంగా ఆలోచించాను. ఇద్దరు కలిపి చేసిన తప్పుకు మనం కేవలం ఆడవాళ్ళనే విమర్శిస్తాం. మన వేలు కూడా వాళ్ళనే ఎత్తి చూపుతుంది! ఇద్దరినీ తప్పు పట్టాల్సిన విషయంలో ఆడవాళ్ళు మాత్రమే దోషులుగా మిగిలిపోతారు! వాళ్ళకే అన్యాయం జరుగుతుంది! అరిటాకు లాంటి అమాయకుల జీవితాలతో ఆటలాడటం తగనిపని అని ముల్లునూ హెచ్చరించి శిక్షించాలి! విరిచి మరెవరికీ గుచ్చుకోకుండా దూరంగా పారెయ్యాలి!

నాగ సుందరి తన నడవడిని మార్చుకుని జీవితాన్ని వివేకంతో తీర్చి దిద్దుకుంటోంది! ఆ విషయంలో వసుంధరగారు ఆ అమ్మాయికి మంచి మనసుతో చేయూత నిస్తున్నందుకు మనమూ అభినందించాలే తప్ప మనసు కష్టపెట్టుకోకూడదు...? అవునా...?’’

మహాలక్ష్మి మాటలకు ఆవిడ ఆలోచనలో పడినట్లుగా ఒక క్షణం వూరుకుని తర్వాత అవునన్నట్లుగా తలవూపింది.

* * *

క్లాసునుండి వచ్చిన మహాలక్ష్మి టైము అయిపోవటంతో ఇంటికి బయలుదేరటానికి తన బ్యాగు, బుక్స్ అన్నీ సర్దుకుంటుంటే... శ్రీవాణి అనే ఆవిడ అడిగింది.

‘‘ఎందుకు మహాలక్ష్మిగారూ... ఇంటికి వెళ్ళటానికి మీ కంత తొందర...? మీకేం ఫామిలీ జంజాటం లేదుగా. ఎదురు చూసేవాళ్ళూ, లేటయిందేమని నిలదీసేవాళ్ళు లేరు. ఇంట్లోకి అడుగు పెట్టీ పెట్టగానే, మీదపడి మారాం చేసే పిల్లలగోలా లేదు! స్వేచ్ఛా జీవులు కదా...!’’

వెంటనే విజయ అందుకుంది. ‘‘అవును... అందరం కబుర్లు చెప్పుకుంటున్నాంగా. అయిదు నిముషాలు కూర్చోకూడదా...?’’

ఇంకొకాయన ‘‘ఎందుకనండీ మా మాటల్లో ఎప్పుడూ పార్టిసిపేట్ చేయరూ...? మీకంత బోర్ కొట్టేస్తుంటామా...?’’ అనడిగాడు. ఆయన కంఠంలో ధ్వనించిన వ్యంగ్యాన్నీ పసిగట్టింది మహాలక్ష్మి. చిరునవ్వుతో చూసింది.

‘‘బోర్ కొట్టటం కాదండీ... అసలు కారణం వేరే ఉంది. మీరేమో ఏవేవో సబ్జెక్ట్సు గురించి వాదిస్తూంటారు. నాకేమో ఆ విషయాల గురించి ఏమీ తెలీదాయె. పరిజ్ఞానం లేకుండా ఏదో ఒకటి మాట్లాడటం కంటే.... మౌనంగా ఉండటమే ఉత్తమం కదాని...’’

అక్కడున్న నలుగురూ ఆశ్చర్యంతో ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ రెండు క్షణాలు బిగుసుకుపోయారు!

మహాలక్ష్మి కూడా వాళ్ళవేపు వింతగా చూసింది. ‘‘అదేమిటీ... ఎందుకు మీరంతా నా మాటలకు అంతగా ఆశ్చర్యపోతున్నారు...? నాకూ సరిపోతుంది కాబట్టి... మన పెద్దలు చెప్పినదాన్నే కోట్ చేశా... అంతేగా...!’’

‘‘కొటేషనే అనుకోండి మహాలక్ష్మిగారూ.. మీరలా రకీమని చెప్పేసరికి... అంటే...! అయినా మీకు పరిజ్ఞానం లేకపోవటం ఏమిటండీ... మంచి లెక్చరర్‌గా మీకెంత పేరుందో మాకు తెలియదా...!’’ అన్నాడు అంతకు ముందు ప్రశ్నించినతనే.

‘‘పేరుదేముందండీ... కొంచెం ఫ్రెండ్లీగా మాట్లాడుతూ పాఠం చెబితే చాలు... పిల్లలు కదూ అభిమానం పెంచేసుకుంటారు! పాఠంచెప్పటానికి నేను ప్రతీరోజు ప్రిపేరు కావలిసిందే లేకపోతే సరిగా చెప్పలేననిపిస్తుంది కూడా!’’ అంది మహాలక్ష్మి.

‘‘అవునండీ దీనికీ ఒక కొటేషన్ ఉంది దీపం వెలుగుతూంటే తప్ప వెలుగు పంచలేదు. అలాగే

ఉపాధ్యాయలూ నిత్యం చదువుతూ నేర్చుకుంటుంటే తప్ప విద్యార్థులకి విజ్ఞానం పంచలేరుట!’’ అన్నారు ఇంకెవరో.

‘‘అవును... సమయానికి మంచి కొటేషన్ గుర్తు చేశారు...’’ అతని వైపుచిరునవ్వుతో చూస్తూ అంది మహాలక్ష్మి.

‘‘అదిసరేగానీ మహాలక్ష్మి, కాసేపు కూర్చోరాదూ.. అందరూ ఇలా సరదాగా మాట్లాడుకుంటున్నాంగా... కొంచెం ఆలశ్యం అయితే మాత్రం ఏమయిందీ...!’’ అంది చనువుగా విజయ.

‘‘నిజమే... ముఖ్యమైన అవసరం ఉంటే ఆలస్యానికేం ఫరవాలేదు. నిజంగానే ఇంటి దగ్గర నేను చక్కబెట్టాల్సిన పనులేం ఉండవు అయితే.... కొంచెం ఆలశ్యం అయినా కారణం తెలియక కంగారుపడే నాన్నమ్మ ఉంది! ఉత్తరాల ద్వారా నేను వినిపించే కబుర్లు కోసం ఎదురుచూసే అమ్మా నాన్నలు ఊళ్ళో ఉన్నారు! వాళ్ళకి వారానికి రెండు సార్లయినా ఉత్తరాలు రాయటమే నాకున్న ముఖ్యమైన పని! కుటుంబం అంటే... భర్తా, పిల్లలూ మాత్రమే నని నేననుకోవటంలేదు. పెద్దవాళ్ళూ చెందుతారుకదా! ఆడవాళ్ళకయినా, మగవాళ్ళకయినా పెళ్ళితో కుటుంబం ఆదనంగా ఏర్పడుతుంది! అంతేగా...!’’ విజయ వైపు చూస్తూ మాట్లాడిన మహాలక్ష్మి బయటకు అడుగులు వేసింది.

హేమంత్ ఉత్తరంలో ప్రస్తావించిన విషయం తనకెలా తెలిసిందనే ఆరాలో సతమత మవుతూంటారో... లేక యాధాలాపంగానే అన్నట్లుగా తను ఇచ్చిన వివరణతో వాళ్ళు మౌనం వహిస్తారో... మనసులోనే అనుకుంటూ నిట్టూర్చింది.

* * *

‘‘మహాలక్ష్మిగారూ... ఒక్క నిముషం...’’ హేమంత్ మాటలకి మహాలక్ష్మి ఆగింది. కాలేజీ టైము అయ్యాక తనకోసం వచ్చిన రిక్షావేపుగా అడుగులు వేస్తూన్న ఆమె ముందుగా కొంచెం కంగారుపడిరది. కాలేజి ఆవరణలోనే తనను అతను పలుకరిస్తున్నందుకు.

స్కూటర్ కొంచెం దూరంగా ఆపి అతను చకాచకా అడుగులు వేస్తూ మహాలక్ష్మి దగ్గరకు వచ్చాడు. ఏమిటన్నట్లుగా కనుచూపుతోనే ప్రశ్నించింది.

‘‘నా ఉత్తరానికి... ఏదో విధంగా సమాధానం చెబుతారని ఎదురు చూసి... ఇక ఆగలేక ఏదో ఒకటి చెప్పండని అడగటానికే...’’

‘‘ఏం చెప్పాలి....?’’ కొంచెం తీక్షణంగానే చూసింది.

‘‘ఒకరితో పెళ్ళి నిశ్చయం చేసుకుంటూ మరొకరికి అలా ఉత్తరం రాయటం మీకు తప్పనిపించలేదా...?’’

అతను కొంచెం బిత్తరపోయినట్లుగా చూసి ‘‘అదేమిటి... అలా అన్నారు... పెళ్ళి ఎవరితో నిశ్చయమైంది నాకు...?’’ ఆశ్చర్యంగా అడిగాడు.

మహాలక్ష్మి వ్యంగ్యంగా అంది ‘‘అది... నేను మీకు చెప్పాలా....! బావుంది! ఒకసారి రామానుజంగారు... మీ అభిప్రాయం సరిగా తెలుసుకోకుండానే, ఏకపక్షంగా ఊహించుకున్నారన్నారు అపుడు మీ అమ్మగారికీ ఆ విషయం తెలియదని చెబితే సమజంసంగానే అనిపించిది. ఇపుడు... మీ ఇష్టాన్ని గ్రహించి, మీ అమ్మగారే తనకూ నచ్చిన అమ్మాయిని కోడలుగాచేసుకోవాలని నిర్ణయించుకోవటం మీకు తెలియదంటే... ఎలా నమ్మమంటారు....? అదీ మీ అమ్మగారే స్వయంగా నాతో చెప్పారుగా...!’’

‘‘ఓ... మీరు నాగసుందరి గురించి అంటున్నారా...?’’

‘‘అవును. తన గురించే.. అర్థమైందిగా?

‘‘అమ్మ... తనకి...భరోసాగా... అతనేదో ఇంకా చెప్పబోతోంటే, మహాలక్ష్మి విసురుగా అడ్డం వచ్చింది. అవునండీ... ఏదో కారణంతో ఒకసారి మోసపోయిన నాగసుందరికి మీ అమ్మగారు ధైర్యం చెప్పటమే కాకుండా అండగా నిలబడి ఇంట్లో ఆశ్రయమూ ఇచ్చారు. అదే సహృదయంతో తన జీవితాన్నొక గాడిలో పెట్టాలనుకుంటున్నారు. ఒకసారి దగాపడిన నాగసుందరి మనసుకు మీరు గాయం చేయకండి. ఇష్టమైన అమ్మాయిని జీవితంలోకి ఆహ్వానించటంలో వెనుకంజ వేయకండి.’’

నిశ్చలంగా నిలబడిపోయిన హేమంత్‌లో క్షణం తర్వాత చలనం వచ్చింది. గట్టిగా నిట్టూర్చాడు.

‘‘సరేనండి. నాకు నచ్చిన అమ్మాయితో జీవితం పంచుకునే విషయంలో నిదానం పనికిరాదని అర్థం అయింది. చొరవ చూపుతాను...’’ అంటూ ‘‘మీరు బయలుదేరండి...’’ అంటూ రిక్షా వైపుగా చేయి చూపించాడు.

మహాలక్ష్మి ఇంకేం మాట్లాడకుండా నాలుగడుగులు వేసి రిక్షా ఎక్కి కూర్చుంది. స్కూటర్ స్టార్ట్ చేసి బయలుదేరిన హేమంత్ వేపు నిర్లిప్తంగా చూసింది.

* * *

''బాబూ... బావున్నారా...?''

ఆ మాటకు చివుక్కున వెనుదిరిగి చూసిన హేమంత్ ఏదో ఆలోచనలో పడ్డట్టుగా చూసేసరికి మళ్ళీ ఆయనే ''నా పేరు రామానుజం... మీనాక్షమ్మ గారింటికని వచ్చినపుడు మీరు మా వాటాలోకీ...''

మధ్యలోనే గుర్తొచ్చినట్లుగా చిరునవ్వుతో చూసి... చేతులు జోడించి... ''బావున్నానండీ... మీరూ... అంతా కులాసాయేగా...!'' అన్నాడు పలుకరింపుగా.

''అంతా క్షేమమే... ఆ భగవంతుడి దయ వలన ఇంట్లో శుభకార్యమూ జరుగుతోంది. మా అమ్మాయి పెళ్లి... ఆ మీనాక్షమ్మగారి నోటి చలువవల్లే కుదిరింది. మంచి సంబంధం. నాలుగురోజుల్లోకి వచ్చేసింది ముహూర్తం. ఇదిగో... ఆ పనుల మీదే ఇలా హడావుడిగా బజార్ల వెంట తిరుగుతున్నాం. ఈ షాపు ముందు మీరు కనుపించేసరికి, పలుకరించి పోదామని ఇటు వచ్చాను. మా కాంపౌండులోని వాళ్ళంతా కూడా తమ ఇంటి ఆడపడుచుపెళ్ళే అన్నట్లుగా పనుల్లో తలో చేయి వేస్తున్నారు...''

''చాలా సంతోషం అండీ...! మంచి కబురు చెప్పారు..!'' అన్నాడు హేమంత్ నవ్వు మొహంతో.

''బాబూ.... ఒకమాట....'' ఆయన సందేహిస్తున్నట్లుగా చూస్తుంటే, హేమంత్ ''చెప్పండీ... ఫరవాలేదు. ఏమిటీ....?'' అన్నాడు చొరవగా.

''అహఁ... ఏం లేదు... మహాలక్ష్మి కుదురైన అమ్మాయి. మీకు అన్నివిధాలా సరిజోడుగా

ఉంటుందనిపిస్తుంది. ఇపుడు అమ్మాయి పనిచేసే కాలేజీలోనే మీరూ చేరారని విన్నాను. ఆ విధంగా ఎందుకు ఆలోచన చేయటం లేదూ అని నేనొకసారి మహాలక్ష్మి గురించి మీనాక్షమ్మగారిని అడిగాను కూడా. 'అమ్మాయి పెళ్ళికి సుముఖంగా ఉంటేనే కదా మేం ప్రయత్నాలు చేయగలం... తనకి ఉద్యోగం చేసుకుంటూ ఇలా ఉండంటమే బావుంటోందని గట్టిగా చెబుతోంటే... ఏం మాట్లాడగలం చెప్పండీ...!' అన్నారావిడ. మహాలక్ష్మి అంగీకారం లేకుండా తన కొడుకూ, కోడలూ కూడా ఎటువంటి ఒత్తిడీ పెట్టరని కూడా మీనాక్షమ్మగారు చెప్పారు. అందుకని మీరే ముందడుగు వేస్తే బావుంటుందని సలహా ఇవ్వాలనిపించింది....''

మహాలక్ష్మికి ఉద్యోగం చేస్తున్నాననే టెక్కు ఎక్కువని, చదువుకున్న అమ్మాయిలు మాట వినరనీ చెప్పిన ఆయనేనా.... ఇపుడు ఇలా మాట్లాడుతున్నారు... ఎంతమార్పు...!

తన ఆశ్చర్యాన్ని పైకి కనుపించకుండా హేమంత్ జాగ్రత్తపడ్డాడు.

నిట్టూరుస్తూ ''పెళ్ళే చేసుకోవాలని లేదంటున్న అమ్మాయి గురించి... ఏం ఆలోచిస్తాం చెప్పండీ...!'' అన్నాడు.

''నచ్చినవాడు ఎదురుపడితే.... అభిప్రాయాలూ మారిపోతాయండీ...'' అంటూ  ఆయన చిరునవ్వుతో చూశాడు..

''పెద్దవాడిని.... చెబుతున్నాగా, మీరు ముందుగా అమ్మాయి అభిప్రాయం కనుక్కోండి. మీలాంటి వాడిని కాదంటుందని నేననుకోను! తర్వాత పెద్దవాళ్ళతో సంప్రదింపులు జరపొచ్చు. మీరొకసారి వాళ్ళింటికి వచ్చి మహాలక్ష్మితో, మీనాక్షమ్మగారితో మాట్లాడి చూడండి... అది, మీకూ, మీ ఇంట్లోవాళ్లకీ ఇష్టమైతేనే అనుకోండీ...!''

''మీరు మంచి సలహానే ఇచ్చారు... అమ్మతో మాట్లాడి...''

అంతలోనే ఆయన అన్నాడు ''అవునవును అలాగే చేయండి. మీరీ మధ్యలో ఒకసారి కూడా వచ్చినట్లు లేదు కూడా...!''

ఆయన తన పనిమీద హడావుడిగా వెళ్ళిపోగానే, హేమంత్ కూడా కదిలాడు.

* * *

ఆ కాంపౌండ్ గేటు తీసుకుని లోపలకు వచ్చిన హేమంత్ ఆశ్చర్యపోయాడు. ఆ నాలుగు వాటాల ముందుగా ఉన్న స్థలమంతా పెద్ద తాటాకుల పందిరి వేసివుంది. కొబ్బరాకులు చుట్టిన స్థంభాల చుట్టూ తిరుగుతూ చిన్నపిల్లలు గోలగోలగా ఆటలాడుతున్నారు.

తలుపు తట్టిన శబ్దానికి తలుపుతీసిన మీనాక్షమ్మ హేమంత్‌ని చూసి ఆనందాశ్చర్యాలతో ఆహ్వానించింది. కుర్చీ చూపించి లోపలకు వెళ్ళి మహాలక్ష్మికి ఆ విషయం చెప్పి, మంచినీళ్ళ గ్లాసుతో తిరిగి వచ్చి అతని చేతికి అందించింది.

''రామానుజం గారు బజారులో కనుపించి, వాళ్ళమ్మాయి పెళ్ళని చెప్పారు. పెళ్ళికి అపుడే పందిరికూడా వేసేసినట్లున్నారే...'' అన్నాడు ఆవిడతో.

''ఇంటిముందు చల్లగా ఉంటుందని మేమంతా అనుకుని కొంచెం ముందుగానే వేయించేశాం! పందిరి వేయటంతోనే పెళ్ళి కళ వచ్చేసింది అందరిళ్ళకీ కూడా.''

''అవునండీ... రామానుజం గారు చెప్పారు... అందరూ కూడా వాళ్ళింట్లో పెళ్ళి అన్నట్లుగా పనులు చక్కబెడుతున్నారని. బావుంది...!'' అన్నాడు నవ్వు మొహంతో.

అంతలోనే లోపలనుండి వచ్చిన  మహాలక్ష్మి అతనికి ఎదురు కుర్చీలో కూర్చొని,  ''మీకో విషయం చెప్పాలి. ఆ మధ్య మన స్టాఫ్ నా గురించి ఒక టాపిక్ లేవనెత్తారు, దాని గురించి నేనేం వివరణ ఇవ్వకుండా, వాళ్ళకి అనవసరమని తేల్చి చెప్పాను.

నాన్నమ్మతో రామానుజంగారు మీకు ఇచ్చిన సలహా గురించి వివరంగా చెప్పారు. అందుకనే మీరెందుకు వచ్చారో ఊహించి, ఈ ప్రస్తావన చేస్తున్నా. ఇంతకు ముందే మన మధ్య ఈ మాట వచ్చింది. నేను నా అభిప్రాయం చెప్పాను.

అయినా పెద్దవాళ్ళు ఏమైనా చెప్పదలచుకున్నారేమో తెలియదుగానీ, నేను మాత్రం తప్పనిసరిగా మీకో విషయం చెప్పాలనిపిస్తోంది! నిజమే, ఆ రోజు కొందరు అన్నట్లుగా... నాకు పెళ్ళయింది...!'' అంది.

ఎలాంటి తడబాటు లేకుండా అతని వేపు నిదానంగా చూసింది. మరుక్షణం కొంచెంగా తలవాల్చింది.

అతని దిగ్భ్రాంతిని గమనించి లోలోన నిట్టూర్చింది.

''ఇష్టం లేదనే ఒక మాటే చాలు. కానీ... ఇలాంటి అసత్యం ఎందుకూ...?''

అతని మాటల్లో కొద్దిగా తొట్రుపాటు వచ్చింది.

''ఇందులో అసత్యం ఏమీలేదు! నిజమే...!'' మళ్ళీ నిక్కచ్చిగా అంది.

''మరి... మరి... మీరిలా... ఒంటరిగా...! నేను నమ్మను! మీరు... కావాలనే ఇలా అంటున్నారనిపిస్తోంది! నిజమే చెప్పండి... ఫరవాలేదు... నేను....!''

అతని మాటలు పూర్తికాక మునుపే మహాలక్ష్మి అడ్డం వచ్చి.... ''అలా ఎందుకనుకుంటున్నారూ...?'' అంటూ మీనాక్షమ్మ వైపు చూసి ''నువ్వే చెప్పు నాన్నమ్మా... నా మాట మీద నమ్మకం లేనట్లుంది...!'' అంది.

నిశ్చేష్టురాలిలా నిలబడ్డ మీనాక్షమ్మ తృళ్ళిపడి తేరుకుని ''అవును.. నిజమే బాబూ...'' అంటూ అక్కడ ఉండకుండా లోపలకు వెళ్ళిపోయింది.